## గుంజపడుగులో హెల్త్ క్యాంప్



మంథని రూరల్ మే 19 (ప్రజా దర్బార్) : మంథని మండలం గుంజపడుగు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 20 నుంచి 50 సంవత్సరాల వయసు గల వారికి బీపీ, షుగర్, హెపటైటిస్-ఏ, హెపటైటిస్-సి, సుఖవ్యాధులు, హెచ్ఐవి తదితర పరీక్షలు నిర్వహించినట్లు ఎంఎల్పిహెచ్ఆర్ వైష్ణవి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్, సర్పంచ్ ఎల్క లక్ష్మి సదానందం, ఏఎన్ఎంలు యు. పద్మ, బి. లీల, ఆశ వర్కర్లు రమాదేవి, స్వప్న, శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్య బానేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

## శాస్త్రవేత్తలు రైతులకు మట్టి నమూనాల సేకరణ



మద్దూర్, మండల్ మే 19 ప్రజా దర్బార్ మద్దూర్ మండలంలోని పల్లెగడ్డ తండాలో,రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నేల ఆరోగ్యం మరియు సేంద్రియ వ్యవసాయం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, ఏ ఆర్ ఎస్, శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్ రెడ్డి, రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ మధు శేఖర్ పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. శాస్త్రవేత్తలు రైతులకు మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల ప్రాముఖ్యత మరియు నేల ఆరోగ్య కార్డుల ఆధారంగా ఎరువుల వినియోగంపై వివరించారు. అధిక దిగుబడులు సాధించాలంటే నేలలో పోషక లోపాలను గుర్తించి సమతుల్య ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. అదేవిధంగా నానో యూరియా వినియోగం వల్ల ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు పంటలకు సమర్థవంతమైన పోషకాలు అందుతాయని, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించారు. రైతులు సాంప్రదాయ యూరియాతో పోల్చితే నానో యూరియాను సరైన దశలో పిచికారీ చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరిస్తూ, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారవంతత తగ్గే అవకాశముందని, సేంద్రియ ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి ఆధారిత పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతులు శాస్త్రవేత్తలను వివిధ వ్యవసాయ సమస్యలపై ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామారెడ్డి తాసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ;

రామారెడ్డి, 19మే, ( ప్రజాదర్బార్ )రామారెడ్డి మండల తాసిల్దార్ కార్యాలయంలో గురువారం కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల అర్హులైన 15 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గౌరవ తాసిల్దార్ ఉమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలం, గ్రామస్థాయిల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, అలాగే అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి నాయకులు భారీగా పాల్గొని కార్యక్రమానికి ఘనత ఇచ్చారు. తాసిల్దార్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ చెప్పారు, రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడపిల్లలకు దారిద్ర్యతను తగ్గించడానికి, వాటి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమగ్రంగా అమలు చేస్తోంది. రెవెన్యూ విభాగం సాధారణ ప్రజలకు అనుకూలంగా, పారదర్శకత్వంతో పథక లబ్ధిదారులకు అందించటంలో శ్రద్ధ పెట్టిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒకరని గుర్తించి అన్యాయాలు లేదా వర్గపక్షపాతం లేకుండా చెక్కులు అందజేస్తామని గుర్తుచేశారు. ఈ సందర్భంలో లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేసి ప్రభుత్వ పథకాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక లబ్ధిదారి మాట్లాడుతూ, ఈ సహాయం ద్వారా మా కుమార్తెకు మొదటిసారి ఖర్చులు సులభం అయ్యాయి. గ్రామంతో పాటు కుటుంబానికి ఇది మద్దతుగా నిలిచిందని తెలిపారు. స్థానిక నాయ కులు, సర్పంచులు ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల వరకు సరైన విదానంతో చేరడంపై సానుభూతి వ్యక్తం చేశారు.



# పెగడపల్లిలో కుల వివక్షత ఎస్సీలను ఎల్లమ్మ గుళ్ళోకి రానీయని గౌడ్స్

### సంఘటనను నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన దళితులు - రెవెన్యూ,పోలీస్ అధికారులు చెప్పిన వినని గౌడ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్,మే19(ప్రజాదర్బార్):రోజురోజుకు సాంకేతిక విప్లవం విస్తరిస్తున్న నేపథ్యంలో కొన్ని మారుమూల ప్రాంతాల్లో ప్రజలు మూఢవిశ్వాసాలతో కొట్టుమిట్టాడుతున్నారు.కుల వివక్షతను ప్రదర్శిస్తూ దళిత వర్గాలైన ఎస్సీలను గుళ్లోకి రానీయకుండా అడ్డుకుంటున్నారు.కులం పేరుతో దూషిస్తూ అవమానిస్తున్నారు.ప్రజల్ని చైతన్యపరచి,అన్ని కులాలు,మతాల ప్రజలు కలిసికట్టుగా సుఖసంతోషాలతో జీవించేలా ప్రోత్సహించాల్సిన కొందరు తమ పబ్బం గడుపుకోవడానికి,ప్రజల్ని విభజించి తమ వైపు తిప్పుకోవడానికి నిచానికి పాల్పడుతున్నట్లు పలువురు విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.పెద్దపల్లి జిల్లా,కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో సోమవారం రాత్రి 11గంటల ప్రాంతంలో గౌడ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ బోనాల సందర్భంగా దళిత వర్గాలైన ఎస్సీలను ఆలయ ప్రవేశానికి నిరాకరించడంతో ఆగ్రహించిన ఎస్సీలు తెల్లవారు జామునుంచి ఉదయం 10 గంటలవరకు ఎల్లమ్మ బోనాలతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.మొదట రెవెన్యూ,పోలీస్ అధికారులు ఎంత చెప్పినా గౌడ కులస్తులు వినలేదు.చివరకు పెద్దపల్లి డిసిపి రాంరెడ్డి,సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు,కాల్వశ్రీరాంపూర్ తహసిల్దార్ రాముడు,ఎస్ఐ వెంకటేష్ లు ఇరు వర్గాలను సముదాయించి శాంతింప చేశారు.రోజురోజుకు కులాలు,మతాల మధ్య అంతరాలు తగ్గుతున్నాయని చంకలు గుద్దుకుంటూ సంబరపడుతున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం విచారకరం.పౌర హక్కుల దినోత్సవం సభల్లో రాజ్యాంగం విలువలు,హక్కులు,బాధ్యతలు ,మూఢనమ్మకాలు గురించి తెలియజేస్తూ ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన సంబంధిత అధికారులు పౌర హక్కుల సభలను తూతూ మంత్రంగా నిర్వహిస్తూ ఇలాంటి సంఘటనలకు కారణమవుతున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.మరో పక్క దళిత సామాజిక వర్గాన్ని చైతన్యపరిచి,వారి హక్కులు బాధ్యతలు,అభ్యున్నతిని గురించి తెలియజేయాల్సిన దళిత,అంబేద్కర్ సంఘాల నాయకులు తమ స్వార్థం,స్వలాభం కోసం అమాయక దళితుల్ని వాడుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొందరు నాయకులు కులాల మధ్య చిచ్చు



పెడుతూ వారిని గ్రూపులుగా విభజిస్తూ తమ రాజకీయ పబ్బం గడపడానికి వాడుకుంటున్నారని సామాజిక విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.గతంలో కొందరు నాయకులు శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ఎస్సీల్లో రెండు వర్గాలు సృష్టించి,ఉద్రిక్తత నెలకొల్పిన సందర్భంలో అప్పటి సుల్తానాబాద్ సిఐ రాములు ఎస్సీలను పిలిపించి సమస్య పరిష్కరించారు.అలాగే అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ స్థలం,జమ్మి చెట్టు స్థాపన స్థలం వివాదంలో కూడా ఎస్సీలు,బీసీల మధ్య ఉద్రిక్తత నెలకొంది.ఈ విషయంలో కూడా ఆ నాయకులే తమ ప్రయోజనం కోసం తాము వెనుకుండి చక్రం తిప్పితూ సంఘటనకు కారకులయ్యారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.ఈ సంఘటనలో కూడా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కల్పించుకొని సమస్యను పరిష్కరించారు.ఇలాంటి సంఘటనే గతంలో పెద్ద రాతుపల్లిలో కూడా జరిగింది.ఈ నేపథ్యంలో పెగడపల్లి సంఘటనలో కూడా నాయకుల హస్తం ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు.మండలంలో వరుసగా జరుగుతున్న ఇలాంటి సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టి,అమాయక ప్రజల భావోద్వేగాలతో చెలగాట మాడుతున్న బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఈ సంఘటనపై పెగడపల్లి దళితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ వెల్లడించారు.

## ట్రాఫిక్ నేరాలపై ఆర్జీఐఏ పోలీసుల ఉక్కుపాదం డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేని వాహనదారులపై ప్రత్యేక డ్రైవ్

శంషాబాద్ 19(ప్రజాదర్బార్):- ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని మే 19, 2026న నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించారు. మొత్తం 15 కేసులను పరిష్కరించి రూ.32,000 జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనం నడిపిన డి. సుదర్శన్ అనే వ్యక్తిని రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె. వేణుగోపాల్ రెడ్డి ఎదుట హాజరుపరచగా, ఒక రోజు సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కింద మొత్తం 10 కేసులు నమోదు చేసి రూ.24,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 4 కేసులు నమోదు చేసి రూ.6,000 జరిమానా విధించారు.రహదారులపై




ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేస్తున్నామని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతరం ప్రత్యేక డ్రైవులు కొనసాగుతాయని తెలిపారు.

## నిప్పుల కొలిమిలా ఏజెన్సీ..- అల్లాడుతున్న ప్రజలు

మంగపేట,మే 19 (ప్రజాదర్బార్): వాతావరణంలో వరుస మార్పులతో ఆకాశం ప్రజలను అతలాకుతలం చేస్తుంది. గత కొన్ని రోజుల నుంచి ఉదయం కొద్దిసేపు మబ్బులతో చల్లగా మారి కొద్ది నిమిషాలలో సూర్యుడు నిప్పుల కొలిమిలా మండిపడుతున్నాడు. దీంతో ఏజెన్సీ మండలాల ప్రజలు అంతలా కృతల మవుతున్నారు. గత రెండు రోజుల నుంచి మరింత వాతావరణ వేణు మార్పు జరుగుతున్నది. సూర్యుడు తూర్పున బారెడు దూరం వచ్చేసరికి భగభగ మండిపడుతున్నాడు. మంగపేట ఏటూరునాగారం కన్నాయిగూడెం వాజేడు వెంకటాపురం ( నూగూర్ ), తాడ్వాయి మండలాల్లో వ్యవసాయ కూలీలు రైతులు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే కూలీలు ప్రతిరోజు వేకువ జామునే ఐదు గంటలకు పనులకు వెళ్తూ మధ్యాహ్నం 12 గంటల వరకు మండుటెండలో ఇంటి ముఖం పడుతున్నారు. మండుతున్న ఎండలతో పాటు వడగాలులు వేయడంతో పా వు గంటకు ఒకసారి గుక్కెడు నీళ్లు తాగుతూ తాపాపంతో తల్లడి లుతున్నారు. మే మాసంలో ప్రతి ఏడాది మాదిరి కంటే ఎక్కువగా ఎండలు మండి పడడంతో జనం అతలాకుతరమవుతున్నారు. సాయంత్రం అయిందంటే సూర్యాస్తమయం తర్వాత గంట వ్యవధులోనే మండే సూర్యుడు చల్లబడడంతో సాయంత్రం రాత్రి దాకా కొంతమంది ఇండ్ల నుంచి బయటకు వచ్చి తమ అవసరాల పనులను తీర్చుకుంటున్నారు. అసలే వ్యవసాయ కూలీలు రైతులు ఉపాధి హామీ కూలీలు వివిధ వర్గాల ప్రజలు ఈ ఎండలతో ఊపిరాడక నల్లడిల్లి పోతున్నారు. ఇక చిన్నారులు వృద్ధుల పరిస్థితి మరి భిన్నంగా తయారైంది.



సూర్యుడు మండిపడడంతో ఎండ వేడిమి తాడలేక చల్లటి పానీయాలను, నీటిని తాగుతూ చెట్ల కింద ఇళ్లలో ఎండ వేడిమి తగ్గేవరకు బయటకు వెళ్లకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ సంవత్సరం వడదెబ్బతో ముగ్గురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఎండలు మరింత పెరిగితే ఏజెన్సీ మండలాల ప్రజలు ఎండ తీవ్రతతో అస్వస్థకు గురయ్యే అవకాశాలు . వాతావరణ శాఖ అధికారులు మాత్రం ఎండలు బాగా పెరిగే అవకాశం ఉందని అత్యవసరం
అనుకుంటేనే పనుల కోసం బయటికి రావాలని మిగతా సమయంలో బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇంకా రోహిణి కార్తె రానేలేదు. ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. అప్పుడు పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని ఏజెన్సీ మండలాల ప్రజలు భయం గుప్పెట్లో మగ్గుతున్నారు.

## చేయూత పెన్షనర్ల సజీవ నిర్ధారణకు ఫేస్ రికగ్నిషన్ యాప్ వినియోగంపై శిక్షణ

వరంగల్ ప్రజాదర్బార్ మే 19: చేయూత పెన్షనర్ల సజీవ నిర్ధారణ (లైవ్‌నెస్ సర్టిఫికేషన్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ఫేస్ రికగ్నిషన్ యాప్ వినియోగంపై వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు (సీఓలు) మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వార్డు వారీగా సంబంధిత సిబ్బందికి ప్రత్యేక లాగిన్లు అందజేశామని తెలిపారు. ప్రతి వార్డులోని కమ్యూనిటీ హాళ్లు, వార్డు కార్యాలయాల్లో చేయూత పెన్షనర్లకు సజీవ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. పెన్షనర్ల ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా యాప్‌లో వివరాలను నమోదు చేసి, వారి సమాచారాన్ని సకాలంలో నవీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా పెన్షన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, సులభతరంగా కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా, చేయూత పెన్షనర్లందరి సజీవ నిర్ధారణ ప్రక్రియను జూన్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని సంబంధిత
అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి పెన్షనర్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డు స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఉప కమిషనర్ (అడ్మిన్) సమ్మయ్య, డీఆర్‌డీఓ ఏపీడీ రేణుక, డీఆర్‌డీఏ ఏపీవో (పెన్షన్స్) శ్రీనివాస స్వామి, పెన్షన్స్ డీపీఎం రేవతి, మెప్మా టీఎంసీ రమేష్, టీవోటీలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 50 శాతం సబ్సిడీ పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ



మద్దూర్, మండల్ మే 19 ప్రజా దర్బార్ మద్దూర్ మండలంలోని పల్లెర్ల గ్రామ రైతు వేదికలో, మంగళవారం,పచ్చి రొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ, పచ్చి రొట్ట ఎరువుల సాగు ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు భూమిలో సేంద్రియ కార్బన్ శాతం మెరుగుపడుతుందని తెలిపారు. పంటలకు అవసరమైన పోషకాలు సహజసిద్ధంగా లభించి రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని వివరించారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చి రొట్ట ఎరువుల సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అలాగే పచ్చి ఎరువుల విత్తనాలు మద్దూర్ అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉన్నాయని, రైతు వాటాగా క్వింటాల్‌కు రూ. 8,175 చెల్లించి పొందవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధిక సంఖ్యలో విత్తనాలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దూర్, పిఎసిఎస్, చైర్మన్ జి నర్సింలు, మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు హాజరై పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.గమనిక : జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి ని కలసి పట్టాదారు పాసుపుస్తకం. మరియు ఆధార్ కార్డు ఇయ్యగలరు,

## మహిళపై దాడి చేసిన సర్పంచ్ మేడ రాజయ్య పై చర్యలు తీసుకోవాలి




మంథని, మే 19 (ప్రజాదర్బార్ ) మంథని మండలం గోపాలపూర్ సర్పంచ్ మేడ రాజయ్య తనపై దాడికి పాల్పడ్డాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు మేడ విజయ మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన అత్తమామలు సంపాదించిన వ్యవసాయ భూమికి సంబంధించి కొంతకాలంగా వివాదం కొనసాగుతోందని, ఈ విషయమై మంథని కోర్టులో కేసు కూడా నడుస్తోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని గోపాలపూర్ గ్రామ సర్పంచ్ మేడ రాజయ్య తనపై కక్ష పెంచుకున్నాడని ఆరోపించింది.తాను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మేడ రాజయ్య తన ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ ఇంట్లోకి ప్రవేశించాడని తెలిపింది. అనంతరం తన వెంట తెచ్చుకున్న కర్రతో దాడి చేసి ఎడమ భుజం, ఎడమ చేతి భాగం, పక్కటెముకల వద్ద గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా గొంతు పట్టుకుని చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించింది.అడ్డు వచ్చిన వారిపైనా మేడ రాజయ్య, అతని భార్య ఓదమ్మ, కుమారుడు సత్యనారాయణ దుర్భాషలాడుతూ దాడికి దిగేందుకు ప్రయత్నించినట్లు బాధితురాలు తెలిపింది.తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితురాలు మంథని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం నిల్వ కొరకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలి

నిర్మల్, మే 19(ప్రజాదర్బార్, ప్రతినిధి) జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతు కన్నీటిగోడు. రైతు భరోసా పేరుతో ప్రభుత్వం సంబరాల జోరు..

## - కేసీఆర్ ప్రభుత్వంలో వడ్ల కొనుగోళ్లలో ఏనాడూ ఇంతటి దారుణ పరిస్థితులు లేవు- రైతు సమస్యలను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం.. సిగ్గు లేకుండా రైతు భరోసా పేరుతో సంబరాలు.. కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



ప్రజాదర్బార్, మోతె, మే 19 మంగళవారం మోతె మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.నెల రోజులైనా వడ్లు కొనడం లేదని, తరుగు పేరుతో దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయన అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో వడ్ల కొనుగోళ్లలో ఏనాడూ ఇంతటి దారుణ పరిస్థితులు లేవు ఆయన తెలిపారు.జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మేం చాలా బాగా వడ్లు కొంటున్నాం, ఎవరికీ ఇబ్బంది లేదు అని గొప్పలు చెప్పారు. కాని అయ్యా ఉత్తమ్.. నేను ఏసీ రూమ్ లో కూర్చుని మాట్లాడటం లేదు. మీరు మీ సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారి దత్తత తీసుకున్న మోతే మండల కేంద్రంలోని రైతుల మధ్య నిలబడి మాట్లాడుతున్నా. 44 డిగ్రీల ఎండలో రైతులు నెల రోజులుగా పడిగాపులు కాస్తూ, పిట్టల్లాగా రాలిపోతున్నారు. ఇది పూర్తిగా మీ ప్రభుత్వ చేతగానితనమే అని ఆయన విమర్శించారు.మాయిశ్చర్ చూడటానికి పది రోజులు, సంచులివ్వడానికి వారం, కాంటాకు వారం, మిల్లుకు వెళ్లడానికి మరో వారం పడుతోంది ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తీరా మిల్లుకు వెళ్లాక తాలు ఉందని చెప్పి లారీకి 4, 5 బస్తాలు కటింగ్ పెడుతున్నారు. మిల్లులో కోత.. అసలు మీకు వడ్లు కొనడం చేతనవుతోందా?ఉత్తమ్ కుమార్ రెడ్డి గారూ.. గల్లీలకు వచ్చి రైతుల గోస వినండి. మీ రేవంత్ రెడ్డి పాలన ఎట్లా ఉందంటే.. ఢిల్లీకి నజరానా, రైతులకేమో జరిమానా అన్నట్టుగా తయారైంది. 69 సార్లు ఢిల్లీకి పోయి కప్పం కట్టే బదులు రైతులను పట్టించుకోండయ్యా..తరుగు పెడితే తోలు తీస్తా అన్న సీఎం.. ఇప్పుడు ఎవరి తోలు తీస్తాడో చెప్పాలి. ప్రతి బస్తాకు 2-3 కిలోల తరుగు తీస్తుంటే ఏం చేస్తున్నారు? బీఆర్ఎస్ హయాంలో మేము 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాము. మీరు కొనడం చేతగాక అబద్ధాలు చెబుతున్నారు. రైతు భరోసా వారోత్సవాలు అని సిగ్గులేకుండా సంబరాలు చేస్తున్నారు. ఎకరాకు చొప్పున విడతల వారీగా విదిలిస్తూ సంబరాలు ఏ మొహం పెట్టుకుని చేస్తున్నారు? రైతుబంధు, యూరియా, రుణమాఫీ, కొనుగోళ్లు అన్నీ ఎగ్గొట్టినందుకు చేస్తున్నారా ఈ వారోత్సవాలు? రాష్ట్ర, దేశ చరిత్రలో యూరియా అమ్మకాలపై నిషేధం విధించిన ఏకైక ఘనత రేవంత్ రెడ్డి సర్కార్ దే. కేసీఆర్ కరెంటు, సాగునీరు, రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారు. కానీ మీరు ధాన్యం కొనకుండా జాప్యం చేసి, రైతులు దళారులకు అగ్గువకు అమ్ముకునేలా కుట్ర చేస్తున్నారు. వాతావరణ శాఖ అకాల వర్షాలు, తుఫాను హెచ్చరికలు జారీ చేస్తోంది. వర్షం వస్తే అంతా నీట మునిగి వడ్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని మార్కెట్లకు సరిపడా లారీలు, గన్నీ బ్యాగులు పంపాలి. మిల్లర్లకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి యుద్ధప్రాతిపదికన వడ్లు కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్, అరె లింగారెడ్డి,మిక్కిలినేని సతీష్ బాబు,శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి,పగడాల వెంకట రెడ్డి,ఇండ్లవెంకటేశం,పల్స మల్సూర్ సర్పంచులు కోడి లింగయ్య,కుక్క బిక్షం,సుప్రజా శ్రీను,మూడు నగేష్, వెంకన్న గాంధీ, పాషా, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు లో కోడి పందాలపై పోలీసుల మెరుపు దాడి...

## - 14 మంది అరెస్ట్, మాజీ పోలీస్ సహా పలువురు రిమాండ్. - కీలక సూత్రధారి తాజా ప్రజాప్రతినిధి కుమారుడు. - గంజాయి, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం - పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి





సుల్తానాబాద్, మే -19(ప్రజా దర్బార్) : ఎలిగేడు మండలంలోని శివ పల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరాలపై పోలీసులు నిర్వహించిన మెరుపుదాడుల్లో 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో మాజీ పోలీస్ ఉద్యోగి కూడా ఉండటం సంచలనంగా మారింది.పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి మంగళవారం సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీసీపీ భూక్య రామ్ రెడ్డి తెలిపిన ప్రకారం, ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ శివారులోని బోడగుట్ట ప్రాంతంలో రహస్యంగా కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందగా, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ ఆధ్వర్యంలో, సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు, పెద్దపల్లి సీఐ కె.ప్రవీణ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఆకస్మిక దాడులు నిర్వహించగా, కోడిపందాల ప్రధాన సూత్రధారి ఓ తాజా ప్రజా ప్రతినిధి కుమారుడు ఎలిగేడు మండలం శివ పల్లి గ్రామానికి చెందిన దుగ్యాల కార్తీక్ రావు సారథ్యంలో అదే గ్రామానికి చెందిన ఓజ్జ శంకర్, పొన్నాల రాజు, పెద్దపల్లికి చెందిన బత్తుల రాజు, మందమరి మండలం గుడిపల్లి కి చెందిన సల్లూరి పవన్, ఇందారం కు చెందిన గడ్డం రాజేష్, గోదావరిఖని కి చెందిన పొట్లపల్లి మనోహర్ ఎండి రహీం, ఇందారం కు చెందిన పెన్నా రవీందర్, వేల్పుల సతీష్, పెద్దపల్లికి చెందిన పులి నాగరాజు, రామగిరి కి చెందిన కొల్లూరి మహేష్, జైపూర్ మండలం టేకుమట్ల కు చెందిన ఎండి సమాధు, పెద్దపల్లికి చెందిన సింగారపు అఖిల్ వర్మ, లను అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుండి 13 మొబైల్ ఫోన్స్, 40 వేల రూపాయల నగదు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక ఎర్టిగా కారు, ఆరు కోళ్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు మరి కొంతమంది పరారీలో ఉన్నారని వివరించారు. గతంలో వైద్య శంకర్, ఎండి రహీం, వేల్పుల సతీష్, పొన్నాల రాజు లపై వివిధ పోలీస్ స్టేషన్ లలో కోడి పందాల కేసులు నమోదై ఉన్నాయని వివరించారు.నిందితులపై జూదం, జంతు హింస నిరోధక చట్టాలతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు.గంజాయి, మత్తు పదార్థాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతారని డీసీపీ హెచ్చరించారు.సంప్రదాయాల పేరుతో చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మూగజీవాలను హింసించడం కూడా నేరమేనని స్పష్టం చేశారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీసీపీ తెలిపారు.దాడుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు డీసీపీ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, బసంత్ నగర్ ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్, సనత్ రెడ్డి, శ్రీధర్, నరేష్ లతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫోటో కవరే... సామాజిక సందేశం

## - కెమెరాను సమాజ చైతన్యానికి ఆయుధంగా మలిచిన ఫోటోగ్రాఫర్ ఏశాల కృష్ణ జీవన ప్రయాణం






తుర్కపల్లి,ప్రజాదర్బార్ మే 19: ఒక చిన్న పాస్ ఫోటో కవర్... సాధారణంగా చూస్తే అది కేవలం ఫోటో పెట్టుకునే కాగితపు కవర్ మాత్రమే.కానీ అదే కవర్ సమాజాన్ని మేల్కొలిపే సందేశంగా మారితే...? అదే ఆలోచనను కార్యరూపంలో పెట్టిన వ్యక్తి యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్ ఏశాల కృష్ణ.గత 33 ఏళ్లుగా ఫోటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న ఆయన, కెమెరాతో కేవలం చిత్రాలను మాత్రమే కాకుండా సమాజానికి అవసరమైన సందేశాలను కూడా బంధిస్తున్నారు.తన వృత్తిని జీవనోపాధిగా మాత్రమే కాకుండా,సమాజ మార్పుకు ఒక సాధనంగా మలుచుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

చిన్ననాటి ఆసక్తి నుంచి సేవా దృక్పథం వరకు చిన్నప్పటి నుంచే ఫోటోగ్రఫీపై ఆసక్తి పెంచుకున్న ఏశాల కృష్ణ,కాలక్రమేణా దానిని తన వృత్తిగా ఎంచుకున్నారు.అప్పట్లో కెమెరా అంటే అరుదైన వస్తువు.ఫోటో తీయించుకోవడం ఒక ప్రత్యేక సందర్భం.అలాంటి రోజుల్లో ప్రారంభమైన ఆయన ప్రయాణం,ఇప్పుడు డిజిటల్ యుగానికీ విజయవంతంగా కొనసాగుతోంది.గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, కుటుంబ వేడుకలు,పాఠశాల కార్యక్రమాలు,ఏ సందర్భమైనా ఆయన కెమెరా అక్కడ ఉండేది.ప్రతి ఫోటోలో ఒక భావోద్వేగాన్ని బంధించడం ఆయన ప్రత్యేకతగా మారింది. 2020లో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసిన సమయంలో,ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఆలోచన ఏశాల కృష్ణలో మొదలైంది.అప్పుడు ఆయనకు ఒక వినూత్న ఆలోచన వచ్చింది.ఫోటోలు తీసుకునేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి ఇచ్చే పాస్ ఫోటో కవర్లపై "బతికి బట్టకట్టాలంటే... మూతికి బట్ట కట్టాల్సిందే"అనే నినాదాన్ని ముద్రించడం ప్రారంభించారు.మాస్క్ వినియోగం,శానిటైజర్ అవసరం,జాగ్రత్తల ప్రాముఖ్యతను చిన్న కవర్ల ద్వారానే ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఆ సందేశాలు ప్రజల్ని ఆలోచింపజేశాయి.అప్పటి నుంచి ఆయన కవర్లు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా మారాయి. కరోనా తర్వాత కూడా ఆయన ప్రయాణం ఆగలేదు.సమాజానికి ఉపయోగపడే ఎన్నో అంశాలను తన కవర్లపై ముద్రిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.తలమీదే రక్షణ... మీదే బాధ్యత అంటూ హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు.యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా జాగ్రత్త పడాలని సందేశమిచ్చారు."రక్తదానం చేయండి... ప్రాణదాతలుగా నిలవండి" అంటూ రక్తదానం,అవయవదానంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు."చేతి సంచితో బజారుకు వెళ్దాం -- ప్లాస్టిక్‌ను తరిమేద్దాం" అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిస్తున్నారు.ధూమపానం,మత్తు పదార్థాలు,డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించే సందేశాలను కవర్లపై ముద్రిస్తూ యువతను మేల్కొలుపుతున్నారు. చిన్న సైజులో ఉండే పాస్ ఫోటో కవర్లపై ప్రింటింగ్ చేయడం అంత సులభం కాదు.సాధారణ ప్రింటర్లతో అది సాధ్యం కాకపోవడంతో ప్రత్యేకంగా ఒక ప్రింటర్‌ను కొనుగోలు చేశారు.ప్రింటింగ్ సమయంలో పేపర్లు జామ్ కావడం,ఇంక్ సమస్యలు రావడం,కవర్లు చెడిపోవడం వంటి ఇబ్బందులు ఎదురైనా ఆయన వెనక్కి తగ్గలేదు.సమాజానికి ఉపయోగపడే పని చేయాలంటే కష్టాలు సహజం అన్న నమ్మకంతో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌ల హవాలో ఫోటోగ్రఫీ రంగం ఎన్నో మార్పులను చూసింది.అయినప్పటికీ,జీవితంలోని మధుర క్షణాలను శాశ్వత జ్ఞాపకాలుగా నిలిపేది ఒక్క ఫోటో మాత్రమేనని కృష్ణ గట్టిగా విశ్వసిస్తున్నారు.ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే మరియు భారత తొలి మహిళా ఫోటో జర్నలిస్ట్ హోమయి వ్యారావాలా చిత్రాలను కూడా తన కవర్లపై ముద్రిస్తూ ఫోటోగ్రఫీ రంగంపై తనకున్న గౌరవాన్ని తెలియజేస్తున్నారు. ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్న అనేక మంది యువతకు శిక్షణ ఇచ్చి,వారికి ఉపాధి అవకాశాలు కల్పించారు.కెమెరా ఎలా ఉపయోగించాలి,ఫ్రేమ్ ఎలా ఉండాలి,ఫోటోలో భావాన్ని ఎలా బంధించాలి వంటి అంశాల్లో శిక్షణ ఇస్తూ పలువురిని ఈ రంగంలో నిలదొక్కుకునేలా చేశారు. సాధారణంగా కనిపించే ఒక పాస్ ఫోటో కవర్‌ను సమాజ మార్పుకు సాధనంగా మలచడం చిన్న విషయం కాదు.ప్రతిరోజూ వందలాది మంది చేతుల్లోకి వెళ్లే ఆ కవర్లు ఇప్పుడు సామాజిక చైతన్య సందేశాలను మోస్తున్నాయి.ఒక ఫోటోగ్రాఫర్ తన కెమెరాతో కేవలం చిత్రాలను మాత్రమే కాదు, సమాజాన్ని కూడా మార్చగలడని నిరూపించిన వ్యక్తి ఏశాల కృష్ణ.ఆయన చేస్తున్న ప్రయత్నం నేటి యువతకు స్ఫూర్తి... సమాజానికి ఒక సందేశం.







# జయశంకర్ జిల్లాలో 3210.51 వార్షిక క్రెడిట్ ప్రణాళిక:జిల్లా కలెక్టర్



భూపాలపల్లి ప్రజాదర్బర్ ప్రతినిధి మే 19. జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్రెడిట్ ప్రణాళిక 3210.51 కోట్లుగా నిర్దేశించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డిసిసి, డీఎల్ఆర్సీ మరియు 2026-27వార్షిక రుణ ప్రణాళిక కార్యక్రమాలపై బ్యాంక్ కంట్రోలర్లు, డిఆర్డీఓ, ఎస్సి, ఎస్టీ, బిసి, మెప్మా తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం మరియు అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకుల ద్వారా విస్తృత స్థాయిలో రుణాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఫార్మ్ క్రెడిట్ కింద పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ. 1273.51 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు టర్మ్ లోన్ల రూపంలో రూ. 762.61 కోట్లు కేటాయించగా, మొత్తం వ్యవసాయ రుణ సామర్థ్యం రూ. 2341.31 కోట్లుగా నిర్ణయించబడినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు రూ. 112.89 కోట్లు, విద్యకు రూ. 19.77 కోట్లు, గృహ నిర్మాణానికి రూ. 82.00 కోట్లు, పునరుత్పాదక శక్తి రంగానికి రూ. 1.44 కోట్లు, ఇతర రంగాలకు రూ. 19.80 కోట్లు, సామాజిక మౌలిక వసతులకు రూ. 22.28 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం ప్రాధాన్య రంగాలకు రూ. 2599.49 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ. 611.02 కోట్లు కేటాయించబడగా, మొత్తం వార్షిక క్రెడిట్ ప్రణాళిక పరిమాణం రూ. 3210.51 కోట్లుగా నిర్ణయించబడినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా అభివృద్ధికి బ్యాంకులు, అధికారులు సమన్వయంతో పని చేసి ఈ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, రైతు భీమా, ఉపాధి హామీ పథకం తదితర నిధులు నిలుపుదల చేస్తున్నారని ప్రభుత్వం ఇచ్చే చేయొద్దని సూచించారు. స్వయం ఉపాధికి అందించే యూనిట్లులో పాడి పరిశ్రమకు సంబంధించి స్థానికంగా కినుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుండి తీస్తున్న యూనిట్లు ఇక్కడి వాతావరణాన్ని తట్టుకోలేక తక్కువ పాలు ఇస్తున్నాయని, కొన్ని చనిపోతున్నాయని మార్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంట రుణాలు బాకి ఉన్న రైతుల జాభితా ఇస్తే అవగహన కల్పించి రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని సూచించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని బ్యాంకర్లు, విద్యా, వైద్య రంగాలకు సహకరించాలని తెలిపారు. అజాంనగర్, చల్లగరిగే, కొడవటంచ, గన్ పూర్ లలో బ్యాంక్ బ్రాంచ్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం 2026-27 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఆర్బీఐ ఎల్డిఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం టిసి రవి మున్సిపల్ చైర్ పర్సన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిఆర్డీఓ బాల కృష్ణ, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, డి టి డబ్ల్యూ ఓ నాగ సాగర్, మెప్మా పిడి రాజేశ్వరి, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో ఖచ్చితత్వం పాటించాలి



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్ మే 19: జనగణన-2027 తొలి విడతలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి గణన ప్రక్రియను పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు.మంగళవారం చౌటుప్పల్‌లో ఇంటి గణన ప్రక్రియను పరిశీలించిన ఆయన ఎన్యూమరేటర్లు మొబైల్ యాప్ ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలు కూడా సరైన సమాచారం అందించాలని కోరారు.అనంతరం తంగడపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్,రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని ఆదేశించారు.నిర్మాణంలో ఉన్న నూతన పీహెచ్‌సీ భవన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.తదుపరి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్,రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి,జిల్లా వైద్యాధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

